



వలస నేతల.. బలమెంత?

- జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో నేతల క్యూ
- లోక్‌సభ ఎన్నికల్లో వారి మద్దతుపై భారీ అంచనాలు
- కొత్త, పాత నేతల మధ్య కుదరని సమన్వయం
- ఎన్నికల ప్రచారంలో ముందుంటూ.. హల్‌చల్ చేస్తున్న నేతలు
- రాజకీయ భవిష్యత్తుపై వలస నేతల ముందుచూపు

ఆదిలాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలోకి జోరుగా వలసలు కొనసాగుతున్నాయి. అధికారంలోకి రావడంతో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో అసెంబ్లి ఎన్నికల వరకు బలహీనంగా కనిపించిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికలు రావడంతో బలపడేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. నిన్న మొన్నటి వరకు కాంగ్రెస్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన నేతలంతా.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో రాజకీయ సమీకరణలు మారిపోతున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలకు గాను గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. మిగితా ఆరు నియోజకవర్గాల్లో పార్టీ రెండు, మూడు స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ చేరికలపై ప్రత్యేక దృష్టిని సారిస్తుంది. కొన్నిచోట్ల వలసలపై కొంత వ్యతిరేకత వ్యక్తమవుతున్నా.. పార్టీ నేతలు పెద్దగా పట్టించుకున్నట్లే కనిపించడం లేదు. ముందున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేందుకు అందరి మద్దతు అవసరమన్న అభిప్రాయంతో పార్టీ పెద్దలు ఉన్నట్లు తెలుస్తుంది. పార్లమెంట్ పరిధిలో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 35.92 శాతం ఓట్లను సాధించగా.. బీజేపీ 34.64 శాతం, కాంగ్రెస్ మాత్రం 19.47 శాతం ఓట్లను సాధించి మూడవ స్థానంలో నిలిచింది. ఇంకా అసెంబ్లీ ఎన్నికల వేడి చల్లారనే లేదు.. అప్పుడే నేతలు కండువాలు మార్చేయడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. అయితే వలస నేతల బలమెంతో ఈ లోక్‌సభ ఎన్నికలతో తేలిపోనుందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశం ఉండడంతో వలస నేతలు తమ రాజకీయ భవిష్యత్తుపై ముందుచూపుతో అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది.

కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చేనా?


కొత్తగా నేతల చేరికలతో కలిసి వస్తుందని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. వారి మద్దతుపై భారీ అంచనాలు వేసుకుంటుంది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో వారి ప్రభావం ఏమేరకు ఉంటుందోనన్న చర్చ సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజావ్యతిరేకతను కూడగట్టుకున్న నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. గతంలో పార్టీ అభ్యర్థిని గెలిపించుకోలేక పోయిన నేతలు.. ఇప్పుడెలా గెలిపిస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీ నుంచే కాంగ్రెస్‌లోకి వలసలు కనిపిస్తున్నాయి. పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన కొంతమంది నేతలపై అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడంతో మళ్లీ అధికారాన్ని చెలాయించవచ్చుననే ఆలోచనతో ఉన్నా.. ఓటర్లు మాత్రం ఎవరికి అండగా నిలుస్తారో అర్థం కాని పరిస్థితి కనిపిస్తోంది. అయితే సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. పార్టీలోకి ఎవరు వచ్చినా.. కాదు, కూడదంటూ కాంగ్రెస్ చేర్చుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు నియోజకవర్గాల వారీగా అంచనాలు వేసుకుంటున్నా.. ఆశించిన స్థాయిలో ఓట్లు పడుతాయో? లేవో?నన్న అనుమానం కాంగ్రెస్‌ను వెంటాడుతోంది.

ప్రాధాన్యత ఉండదేమోనన్న భయం

కొత్త నేతల చేరికతో పార్టీలో ప్రాధాన్యత ఉండదేమోనన్న భయం కాంగ్రెస్ క్యాడర్‌లో కనిపిస్తోంది. అందుకే కొన్నిచోట్ల కీలక నేతలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా చేరికలు జరిగిపోవడంతో కొత్త, పాత నేతల మధ్య సమన్వయం కరువవుతోంది. లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నా.. కలిసి ప్రచారంలో పాల్గొన్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. పార్టీలో వలస నేతలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని తప్పుబడుతున్నారు. నిన్నమొన్న పార్టీలో చేరిన వారికే ప్రాధాన్యత దక్కుతోందని బహిరంగ ఆరోపణలకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితులను ఆసక్తిగా గమనిస్తున్న విపక్షాలు.. తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికీ కొన్ని నియోజకవర్గాల్లో కొత్త, పాత నేతలు కలిసి మాట్లాడుకోవడం కూడా కనిపించడం లేదు. అడపాదడప పార్టీ పెద్దల పర్యటనల్లో మాత్రమే ఒకే వేదికపై కనిపిస్తున్న నేతలు.. ఆ తర్వాత ఎవరిదారి వారిదే అన్నట్లుగా కనిపిస్తోంది. అంతేకాకుండా నేతల మధ్య కనిపిస్తున్న ఆధిపత్య పోరు పార్టీకి మంచిది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా.. పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదు. నేతలంతా కలిసి కట్టుగా ముందుకు వెళ్లకుంటే పార్లమెంట్ పరిధిలో బలంగా కనిపిస్తున్న కమలం పార్టీని ఢీకొట్టడం అంత తేలికైనా పనేమీ కాదన్న అభిప్రాయా లు వ్యక్తమవుతున్నాయి.

మళ్లీ అంతా వారిదే పెత్తనం

అసెంబ్లీ ఎన్నికల వరకు అంతంత మాత్రంగానే కనిపించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రావడంతో వలస నేతలతో సందడి సందడిగా మారిపోయింది. ప్రస్తుతం పార్టీలో అంతా వారిదే పెత్తనం అన్నట్లుగా కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో వలస నేతలే ముందుండి హల్‌చల్ చేయడం కాంగ్రెస్ క్యాడర్‌కు నచ్చడం లేదు. దీంతో పైపైకి బాగానే కనిపిస్తున్నా.. లోలోన మాత్రం వలస నేతల తీరుపై రగిలి పోతునట్లు తెలుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఎన్నో కష్టాలు పడ్డ.. ప్రస్తుతం పార్టీలో సరైన గుర్తింపును ఇవ్వడం లేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఇప్పటికే గ్రూపు విభేదాలతో విసుగెత్తి పోయిన కాంగ్రెస్ పార్టీకి.. కొత్తగా ఏర్పడిన మూడవ గ్రూపుతో ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో పార్టీ పదవులతో పాటు నామినేట్ పదవులను దక్కించుకునేందుకు ఎవరికి వారే ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జీల నిర్ణయమే ఫైనల్ అంటూ చెబుతున్నా.. కొంతమంది సీనియర్ నేతలు మాత్రం అధిష్ఠానం పెద్దలతో నేరుగా టచ్‌లో ఉంటూ పైచేయి సాధించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ అంతా తామే అన్నట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో నేతల మధ్య తలెత్తిన విభేదాలు వివాదాలుగా మారడంతో పార్టీ ఇన్‌చార్జీలకు తలనొప్పిగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.





సభా ఏర్పాట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీతక్క

పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి

- సీఎం సభా స్థలిని పరిశీలించిన మంత్రి సీతక్క

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: ఈనెల 22న పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించనున్న సభా స్థలాన్ని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల పరిశీలన, ప్రధాన వేదిక, జనం ప్రవేశించే మార్గాలు, తదితర విషయాలను నియోజకవర్గ ఇన్‌చార్జీలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21 సాయంత్రం లోపు పనులు పూర్తయ్యేలా చూడాలని మం త్రి సీతక్క ఈ సందర్భంగా వారిని ఆదేశించారు. ముఖ్యమంత్రి సభ విజయవంతమయ్యేలా ఇన్‌చార్జీలకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఇందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, టీపీసీసీ కార్యదర్శి సత్తుమల్లేష్, డీసీసీబీ ఛైర్మన్ అడ్డిభోజారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్‌బాపురావు, రేఖానాయక్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, ఆదిలాబాద్ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్ ఇన్‌చార్జీ ఆడేగజేందర్, ఆసిఫాబాద్ ఇన్‌చార్జీ శ్యాంనాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శాంతన్‌రావు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లా టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలకు సేవలను అందించాలని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టాలని కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బాల సదనంలో పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఇందులో కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము, జిల్లా కార్యదర్శి గంగసరపు ఓమన్న, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి పతిహార ప్రభాకర్, మావల మండల పార్టీ అధ్యక్షుడు తోకల లస్మన్న, మండల నాయకులు ఆరే.రాజన్న, కెనరేందర్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



బాల సదనంలో పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా టీడీపీ నాయకులు

సంక్షిప్త సమాచారం

మూడో రోజు నామినేషన్లు నిల్

ఆదిలాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి మూడవ రోజు శనివారం నామినేషన్లు దాఖలు కాలేదని సంబంధిత జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా తెలిపారు. రెండు రోజులు అడపాదడపగా నామినేషన్లు దాఖలైనా.. మూడవ రోజు మాత్రం నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులెవరూ ముందుకు రాలేదు. ఆదివారం సెలవు దినం కావడంతో ఈనెల 22 నుంచి 25వరకు నామినేషన్లు భారీగా దాఖలయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, తొలి రోజు రెండు, రెండవ రోజు ఒక నామినేషన్ దాఖలయ్యింది. ఇప్పటి వరకు మొత్తం మూడు నామినేషన్ల మాత్రమే దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు మరికొంత మంది స్వతంత్ర అభ్యర్థులు, అంతేకాకుండా రెబల్స్ అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్‌ల గడువు ముగిసేంత వరకు రాజకీయం మరింత హీటెక్కె అవకాశం ఉందంటున్నారు.

28న ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20: ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 28న అర్హత పరీక్ష జరుగుతుందని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కాంబ్లే అనిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వెబ్‌సైట్‌లో హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయాని కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొన్నారు.

అమరులారా.. వందనం

- ఆదివాసీ గిరిజన అమరవీరులకు ఘన నివాళి
- సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు
- పోలీసుల భారీ బందోబస్తు మధ్య ర్యాలీ
- స్థూపం వద్ద నివాళ్లు అర్పించిన జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20: 1981 ఏప్రిల్ 20న జల్ జంగల్ జమీన్ పేరిట నినాదించి అమరులైన ఆదివాసీ వీరులకు నివాళులర్పించడానికి వారి బంధువులు, ఆదివాసీ గిరిజనులు తరలివచ్చి శనివారం స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళులర్పించారు. అమరవీరులకు నివాళులర్పించడానికి మండలంలోని వారి కుటుంబసభ్యులతో పాటు ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండలకేంద్రంలోని ఆదివాసీల ఆరాధ్యదైవం ఇంద్రాదేవి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి అమరవీరుల స్థూపం వదవ్దకు చేరుకుని సంప్రదాయ వాయిద్యాలతో అమరవీరుల పేరిట జెండాను ఆవిష్కరించి, సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పోలీసుల భారీ బందోబస్తు

ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్‌తో పాటు ఇంద్రవెల్లి ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

● అన్ని విధాలుగా ఆదుకుంటాం : మంత్రి సీతక్క

ఆదివాసీ అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. శనివారం స్థానిక ఆదివాసీ గిరిజన అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఆదివాసి గిరిజన అమరవీరుల కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు 1981 అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఆదివాసులపై కాల్పులు జరిపిందని విమర్శలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమరవీరుల సాక్షిగా బహిరంగ సభలో క్షమాపణలు అడగటం జరిగిందన్నారు. అంతేకాకుండా అమవీరుల కుటుంబాలను ఆదుకుంటామని ఇచ్చిన మాట కట్టుబడి ఆదివాసీ అమరవీరుల 15 కుటుంబాలను గుర్తించి ఇళ్ళ స్థలాలను ఇవ్వడం జరిగిందన్నారు. కోటి రూపాయలతో స్మృతి వనం పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆదివాసీ గిరిజన వీరుల పోరాటం ద్వారానే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను, జీవోలను తీసుకొచ్చి అమలు చేసిందన్నారు. అటవీ హక్కుల చట్టం తీసుకొచ్చి ఆదివాసీ గిరిజనులకు అటవీ హక్కు పత్రాలను ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఆదివాసీల అభివృద్ధికి కొమురం భీమ్ కార్పొరేషన్, లంబాడాల కోసం సేవాలాల్ కార్పొరేషన్, ఎరుకల కోసం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆదివాసి గిరిజన అమరవీరులకు నివాళులర్పించిన వారిలో ఎంపీ సోయం బాపూరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు భూక్య జాన్సన్‌నాయక్ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలతా, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పూర్క బాపూరావు, రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భారత్, మండల అధ్యక్షులు జుగ్నాక్ భారత్, నాయకులు సోయం రాందాస్, ఆర్కా ఖమ్ము, తోడసం నాగోరావు, కినక జుగదిరావు, తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా తరలివస్తున్న ఆదివాసీలు గిరిజనులు



స్థూపం వద్ద సంప్రదాయ పూజలు చేస్తున్న ఆదివాసీలు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

పగలంతా ఎండ.. రాత్రి ఈదురుగాలులు

- జిల్లాలో జోరుగా ఎండలు
- చప్రాలలో 44.6 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత
- భగవాన్‌పూర్‌లో గాలివాన బీభత్సం

ఆదిలాబాద్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. పగలంతా ఎండ వేడిమితో అల్లాడుతున్న జనం.. సాయంత్రం వేళల్లో తీవ్రమైన ఈదురుగాలులతో ఇబ్బందులు పడుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్రమైన ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండల తీవ్రత పెరిగి పోతుంది. ఆదిలాబాద్ జిల్లాలో పలుచోట్ల రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 42.8 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 29.2 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా బేల మండలం చప్రాలలో 44.6 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సీజన్‌లో ఈ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే మొదటిసారి. భీంపూర్ మండలం అర్లి(టి)లో 43.7, సిరికొండలో 42.3, మావలలో 42.0, ఆదిలాబాద్ అర్బన్‌లో 41.7, తలమడుగులో 40.0, డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతేకాకుండా జిల్లాలో చాలా చోట్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. నేరడిగొండ, గాదిగూడ, నార్నూర్, బజార్‌హత్నూర్ మండలాల్లో 40 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలంతా తీవ్రమైన ఎండవేడిమి కనిపిస్తున్నా.. సాయంత్రం వేళల్లో మాత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి వడగాలుల ప్రభావం కనిపిస్తోంది. కొన్ని చోట్ల చిరుజల్లులతో కూడిన వర్షాలు కూడా కురుస్తున్నాయి.

● భగవాన్‌పూర్‌లో ఎగిరిపడిన ఇంటి పైకప్పులు

భీంపూర్: మండలంలోని భగవాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. గేడెం సురేష్, గేడెం అశోక్, గేడెం మారుతిల ఇంటిపై కప్పులు లేచి కింద పడ్డాయి. విద్యుత్ స్తంభం పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే, మండలంలో శుక్రవారం రాత్రి గాలి వానకు ధన్నోరా వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి. డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులు కలిసి పడిన చెట్లను తొలగించి ప్రయాణం కొనసాగించారు.



భగవాన్‌పూర్‌లో ఎగిరిపడిన ఇంటి పైకప్పులు



ధన్నోరా వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం



జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి



చేతిపంపు వద్ద దాహార్తిని తీర్చుకుంటున్న ప్రయాణికుడు

'విద్యుత్ సంస్థను లాభాల బాట పట్టించాలి'

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : తెలంగాణ విద్యుత్ సంస్థను నష్టాల నుంచి లాభాల బాట పట్టేలా సిబ్బంది కృషి చేయాలని చీఫ్ ఇంజనీర్ కేఎన్‌గుప్తా కోరారు. శనివారం క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పని చేసేటప్పుడు పాటించాల్సిన భద్రత సూచనలు తెలియజేశారు. విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు, క్షేత్రస్థాయిలో నియంత్రికల మరమ్మతులు, విద్యుత్ పొదుపు, వినియోగదారులకు మెరుగైన నిరంతరాయ సరఫరా గూర్చి వివరించారు. ఎస్ఈ జేఆర్ చౌహాన్, ఇంజనీర్లు నాగరాజు, రవి, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది హాజరయ్యారు.

విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రం వద్ద శనివారం చలివేంద్రాన్ని చీఫ్ ఇంజనీర్ కేఎన్ గుప్తా ప్రారంభించారు. జేఏవో డి. శ్రీనివాస్ తన తండ్రి కీ.శే కృష్ణ చలివేందాన్ని స్పాన్సర్ చేశారు. ఎస్ఈ జేఆర్ చౌహాన్, డీఈ శ్రీనివాస్ రావు, డి. నాగరాజు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు మెగా వైద్యశిబిరం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : నిర్మల్ జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు శనివారం సంఘ భవనంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

శోభాయమానంగా వీర హనుమాన్ విజయయాత్ర

- కాషాయమయమైన ఖానాపూర్
- పార్టీలకు అతీతంగా తరలివచ్చిన నాయకులు
- భజరంగ్ దళ్ శోభాయాత్రలో జై శ్రీరామ్ నినాదంతో మార్మోగిన ఖానాపూర్ పట్టణ వీధులు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం



విజయయాత్రకు భారీగా తరలివచ్చిన జనం

ఖానాపూర్, ఏప్రిల్ 20 : బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శ్రీ వీర హనుమాన్ విజయయాత్ర అత్యంత శోభాయ మానంగా జరిగింది. ఈ యాత్రకు పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో ఖానాపూర్ పట్టణ పురవీధులన్నీ కాషాయమయంగా మారాయి. జై శ్రీరామ్... జై హనుమాన్ నినాదాలతో ఖానాపూర్ పట్టణం మార్మోగింది. మున్సిపల్ చైర్మన్ సత్యం జెండాను ఊపి భజరంగ్‌దళ్ శ్రీ వీర హనుమాన్ విజయయాత్రను ప్రారంభించారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికేని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు మంత్రరాజం సురేష్, వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి వెంక టేశ్వర్లు, భజరంగ్ దళ్ జిల్లా బాధ్యులు కాశవేణి ప్రణయ్, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ శోభాయాత్రను ప్రారంభించారు. ఈ శోభాయాత్ర స్థానిక జంగల్ హనుమాన్ ఆలయం నుండి ఖానాపూర్ పట్టణ పురవీధుల మీదుగా సాగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్ఐ లింబాద్రిల ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

కొండగట్టుకు పాదయాత్రగా హనుమాన్ స్వాములు

సారంగాపూర్, ఏప్రిల్ 20 : మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన హనుమాన్ స్వాములు శనివారం పాదయాత్రగా బయలు దేరారు. ఈ నేపథ్యంలో హనుమాన్ మందిరంలో స్వాములు పూజలు చేశారు. గ్రామంలోని వీధుల్లో హనుమాన్ స్వాములు శోభాయాత్ర చేసి పాదయాత్రగా వెళ్లారు.



కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ స్వాములు



సోనాలలో భీం విగ్రహం వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇంద్రవెల్లి అమరులకు ఆదివాసీల నివాళి

బోథ్, ఏప్రిల్ 20: ఇంద్రవెల్లిలో అమరులు అయిన ఆదివాసీలకు శనివారం సోనాల గ్రామంలో కొమురంభీం విగ్రహం వద్ద స్థానిక ఆదివాసీలు ఘన నివాళ్లు అర్పించారు. ఏప్రిల్ 20 ఆదివాసీలు మరిచిపోలేని రోజని వారు పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం పోరాటాలు చేసిన ఆదివాసీలు ప్రాణాలు కోల్పోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ మాజీ డైరెక్టర్ ఎం.భూమన్న, ఆదివాసీ నాయకులు రాయి సీడం ఇసురు సార్ మేడి తుడసం లక్ష్మణ్, ఉప సార్మేడి ఆత్రం గంగాధర్, గాజుల పోతన్న, ఆవాసీ గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఊపేక్షించేది లేదు : రామన్న

● బీఆర్ఎస్ పార్టీ నుంచి మున్సిపల్ వైస్‌చైర్మన్ సస్పెన్షన్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు పేర్కొన్నారు. ఉద్యమ కాలం నాటి బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే ఊపేక్షించేది లేదన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ల విడుదల

ఇచ్చోడ, ఏప్రిల్ 20: వీరహనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం 3గంటలకు ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన గోడప్రతులను బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ శనివారం పార్టీ కార్యాలయ ఆవరణలో హిందూ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించే భారీ శోభాయాత్ర ఇచ్చోడ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా డీజే చప్పుల్ల మధ్య శోభయాత్ర ఉంటుందని సభ్యులు తెలిపారు. ఈ శోభయాత్రలో హనుమాన్ విగ్రహ ఊరేగింపుతో పాటు హనుమాన్ మాలధారులు భక్తులు పెద్దఎత్తున హాజరై శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరారు.



గుడిహత్నూర్‌లో రథంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

గుడిహత్నూర్, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని పురాతన శివాలయంలో శనివారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి మొక్కులను సమర్పించుకున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా రథ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు భజన, కీర్తన గీతాలు ఆలపించారు. యువకులు నృత్యాలు చేశారు. సాయంత్రం ఆరు గంటలకు వేద మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణం జరిపారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

'సీఎం సభకు కార్యకర్తలు తరలిరావాలి'

తలమడుగు, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 22న ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని జడ్పీటీసీ గణేష్‌రెడ్డి కోరారు. శనివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలకు చెందిన కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల భాగంగా ఈనెల 22న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యురాలు ఆత్రంసుగుణ నామినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నందున ముఖ్య అతిథిగా సీఎంతో పాటు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, ఇతర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో తాంసి ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు ప్రకాష్‌రావు, బాపన్ననరేష్, పోశెట్టి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం జిల్లా కేంద్రానికి వస్తున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆడే వసంత్‌రావు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, జాదవ్ కపిల్‌దేవ్, కుంట శంకర్, తొడసం శంకర్, తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఇంట్లో యజ్ఞం

ఉట్నూర్, ఏప్రిల్ 20: ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం నవగ్రహ సర్వదేవతల యజ్ఞం నిర్వహించారు. తన నివాస గృహంలో తెల్లవారు వేకువ జామున నుంచి నవగ్రహ సర్వదేవతల పూజ, యజ్ఞ హోమంలో పాల్గని ప్రత్యేకపూజలు చేశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని కుటుంబ సమేతంగా నవగ్రహ, సర్వదేవత పూజా కార్యక్రమంలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష

బోథ్, ఏప్రిల్ 20: మండల కేంద్రంలో నీట్ పరీక్షపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అవగాహన పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పరీక్షలను మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సుమీర్ భాష, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమేష్, ఏఐఎస్ఎఫ్ సభ్యులు ఎల్.నరేష్, ముక్రం, మున్సిఫ్, తదితరులు ఉన్నారు.

బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ కృషి

● జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: దేశానికి గాంధీ సిద్ధాంతంతో కూడిన పరిపాలన అవసరముందని పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మావలలోని రత్నాగార్డెన్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఎన్నో గొప్ప గొప్ప సంస్కరణలను తీసుకొచ్చి బడుగు బలహీన వర్గాల కోసం పాటు పడిందని తెలిపారు. ప్రధాని అయ్యే అవకాశమున్నా ఇతరులకు ఆ పదవిచ్చి గౌరవించిన కుటుంబం గాంధీ కుటుంబందని కొనియాడారు. స్వలాభాపేక్షలేని రాహుల్ గాంధీ సొంతిళ్లు కూడా లేని నిస్వార్థ నేత అన్నారు. కాని చాయ్‌వాలా అన్న మోదీ మాత్రం కోట్ల విలువైన సూట్లు వేసుకుంటున్నారని విమర్శించారు. ఈ దేశానికి మోదీ దోస్తులకు దోచి పెడుతున్నాడని ఆరోపించారు. గత ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్టు రెండు కోట్ల ఉద్యోగాల ఊసేలేదని, అభివృద్ధి అడిగితే అక్షింతలు పంపిస్తున్నారని ఎద్దేవ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు మోదీ వచ్చినప్పుడు ఇక్కడి ప్రజలు నిధలిస్తాడనుకుని సంతోషపడ్డారని కాని డ్రైనేజి పనులు ప్రారంభించి పోయాడని విమర్శించారు. బీజేపీ దేవుని పేరుతో రాజకీయం చేస్తుందని, బడి గురించి మాట్లాడదు కానీ, గుడి గురించి మాట్లాడుతోందని అన్నారు. మోదీ రైతులకు రుణాలు మాఫీ చేయలేదు. కానీ బడా పారిశ్రామిక వేత్తలకు మాత్రం లోన్లు మాఫీ చేస్తారని విమర్శించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే ఆదిలాబాద్ సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకులు సిడాంరాంకిషన్, తెలంగాణ కార్మిక సంఘ నేతలు షేక్‌బాబు, షేక్ అహ్మద్, ప్రమోద్‌చౌదరిలు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

● 'విజయానికి సైనికుల్లా పని చేస్తాం'

కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు తెలంగాణలో ఎంపీ అభ్యర్థుల విజయానికి సైనికుల్లా పని చేస్తామన్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల ఎన్ఎస్ యూఐ విభాగాలు శక్తి వంచ లేకుండా కృషి చేస్తాయని తెలిపారు. మొత్తం 17 స్థానాలలో 14 సెగ్మెంట్లలో విజయం సాధిస్తామన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ మాట్లాడుతూ 75ఏళ్ల తర్వాత తొలిసారి ఒక మహిళగా తనకు పోటీ చేసే అవకాశం దక్కిందని మీరందరు తనను ఓట్లతో ఆశీర్వదించి లోక్‌సభకు పంపాలని కోరారు. ఇందులో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్‌బాపురావు, రేఖానాయక్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు, బోథ్ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, ఆసిఫాబాద్ ఇన్‌చార్జీ శ్యాంనాయక్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు శాంతన్‌రావు,ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌లోకి నార్నూర్ మండల నాయకులు

ఉట్నూర్: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు రాష్ట్ర మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నార్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. గత ఎన్నికల్లో కూడా టికెట్ లభించక పోవడంతో నిరాశతో ఉన్న గజానంద్ మంత్రి సీతక్క నేతృత్వంలో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు కొత్తపల్లి మాజీ సర్పంచ్ శేషరావురాథోడ్ మరికొంత మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు.



ఆదిలాబాద్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి



సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు



సంబంధిత సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఉన్నతాధికారులు

ఉపాధిలో అవకతవకలు జరిగితే చర్యలు

● అదనపు పీడీ కుటుంబరావు

తాంసి, ఏప్రిల్ 20: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం అధికారులు 14వ విడత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ పీడీ కుటుంబరావు హాజరయ్యారు. మండలంలోని 13 గ్రామ పంచాయితీల పరిధిలో 01.04.2023 నుంచి 20.04.2024 సంవత్సరం వరకు చేపట్టిన 235 ఉపాధి హామీ పనులకు సంబంధించిన రూ.1,61,49,840లపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో స్వప్నశీల, ఎస్‌టీఎం వేణు, డీఆర్‌పీ కవిత, అంబుడ్స్‌మెన్ వీణా, ఏపీవో విజయ, ఉపాధి హామీ సిబ్బంది, వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ కుటుంబ రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో చేసిన కూలీల పేర్లను హాజరు పట్టికలో ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో సరిగ్గా నమోదు చేయకపోవడంతో కూలీలు నష్టపోయారని అధికారులు గుర్తించడం జరిగిందన్నారు. ఇలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కూలీలకు రావాల్సిన డబ్బులు అందించే విధంగా కృషి చేస్తామని వెల్లడించారు. ఎఫ్ఏలు ఎప్పటికప్పుడు మొటివేట్ చేస్తూ కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు.

తాంసిలో వృద్ధ ఓటర్ల సర్వే

తాంసి, ఏప్రిల్ 20: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయలేని స్థితిలో ఉన్న వృద్ధుల సర్వేను శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ఎవరైతే నడవలేని స్థితిలో ఉన్నారో వారికి ఇంటి వద్ద ఓటు వేసే వెసులుబాటు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వృద్ధులు సద్వినియోగం చేసుకునేలా గ్రామానికి చెందిన యువత సహకరించాలని కోరారు. ఇంటి వద్దకే పోలింగ్ చిట్టి తీసుకువచ్చి తమ సిబ్బంది ఓటు వేయిస్తారని పేర్కొన్నారు. దీంతో వృద్ధులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కారోబార్ సుభాష్, సెక్రటరీ గంగన్న, తదితరులు ఉన్నారు.

ఖానాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అర్ధరాత్రి హైడ్రామా

● విద్యుత్ అధికారుల తీరును నిరసిస్తూ సబ్‌స్టేషన్ ముట్టడించిన సుభాష్ నగర్ కాలనీ వాసులు ● స్థానిక అధికారుల నిర్లక్ష్యంతోనే సమస్యలు వస్తున్నాయంటూ ఆగ్రహం
● సుమారు 7 గంటల పాటు అంధకారంలోనే ఖానాపూర్ శివారు కాలనీలు ● సబ్ స్టేషన్ వద్దకు తరలివచ్చి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మున్సిపల్ చైర్మన్ సత్యం
● గత ఆదివారం శాంతినగర్‌లో హై వోల్టేజ్ సమస్యతో పలు ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధం

ఖానాపూర్, ఏప్రిల్ 20 : ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పకడ్బంది చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశిస్తున్నప్పటికీ ఖానాపూర్‌లో మాత్రం అధికారుల తీరులో మార్పు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వారం రోజులుగా ఖానాపూర్ పట్టణంలో విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నప్పటికీ వాటిని పరిష్కరించడంలో విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఆదివారం మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో తలెత్తిన విద్యుత్ సమస్యతో పలువురి ఇళ్లలో ఎలక్ట్రికల్ పరికరాలు దగ్ధమయ్యాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా శుక్రవారం రాత్రి సుభాష్‌నగర్ కాలనీలో తలెత్తిన విద్యుత్ సమస్యతో పట్టణంలోని పలు కాలనీలు సుమారు 7 గంటల పాటు అంధకారంలో ఉండిపోయాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన సుభాష్‌నగర్ కాలనీ వాసులు శుక్రవారం అర్ధరాత్రి సబ్‌స్టేషన్ ముట్టడించారు. తమ కాలనీలో రెండు రోజులుగా సమస్యలు తలెత్తుతున్నప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. లైన్‌మెన్, ఏఈలు స్థానికంగా ఉండడం లేదని ఆరోపించారు. తమ సమస్యను పరిష్కరించే వరకు పట్టణం లోని ఇతర కాలనీలకు సైతం కరెంట్ నిలిపి వేయాలని పట్టుబట్టారు. దీంతో సబ్ స్టేషన్ వద్దకు మున్సిపల్ చైర్మన్ సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషాలు వచ్చి విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా సుభాష్‌నగర్‌లో సమస్య తలెత్తితే ఉదయం నుండి సాయంత్రం వరకు పనులు చేపట్టకుండా కేవలం రాత్రిపూట మరమ్మతు పనులు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. స్థానికంగా అధికారులు ఉండకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతుందని కాలనీ వాసులు చైర్మన్ దృష్టికి తీసుకురావడంతో ఆయన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి స్థానిక అధికారులపై ఫిర్యాదు చేశారు. వెంటనే విద్యుత్ శాఖ ఏఈని మార్చాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఖానాపూర్ వచ్చిన ఏఈ స్థాయి అధికారులు ఇక్కడ విధులు నిర్వహించకుండా సెలవులపై వెళ్తుండడంతో స్థానికంగా ఉన్న సబ్ ఇంజనీర్ తిరుపతికి ఇన్‌చార్జి ఇస్తున్నారు. గత కొద్ది రోజులుగా వచ్చిన ఏఈలంతా ఖానాపూర్ రావడం విధుల్లో చేరడం ఆ తర్వాత కొద్ది రోజులకే సెలవు పెట్టి వెళ్లడం పారిపాటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ నెల రెండవ తేదీన సైతం ఖానాపూర్ ఏఈగా బాధ్యతలు తీసుకున్న యశ్వంత్‌రావు ఈ నెల 18వ తేదీన సెలవు పెట్టి వెళ్లినట్లు విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏఈల మాదిరిగానే సెలవు పెట్టి వెళ్లిన ఈ అధికారి సైతం అక్కడి నుంచి అటే వెళ్తారా తిరిగి ఖానాపూర్ వస్తారా అనే అనుమానాలు పలువురు వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఖానాపూర్‌కు రెగ్యులర్ ఏఈని నియమించడంతో పాటు సిబ్బంది స్థానికంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 12:30 గంటల వరకు ఖానాపూర్‌లో పలు కాలనీలకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో సోషల్ మీడియా వేదికగా సైతం విద్యుత్ శాఖ అధికారుల తీరుపై పలువురు ప్రజలు మండిపడ్డారు. అర్ధరాత్రి 12:30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో వివాదం సద్దుమణిగింది.



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఫేక్ ఐడీ సృష్టించి.. అశ్లీల ఫొటో పెట్టి

● ఇన్‌స్టాగ్రామ్‌లో బాలికకు వేధింపులు ● పోలీసులను ఆశ్రయించిన బాలిక ● ఫిర్యాదులో అనుమానితుల పేర్లు
● దర్యాప్తు అనంతరం నిందితుడి అరెస్టు ● నిర్మల్ జిల్లాలో ఘటన

మామడ, ఏప్రిల్ 20 : ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ బాలిక పేరిట ఫేక్ ఐడీ సృష్టించి.. అశ్లీల ఫొటోలు పెట్టి సదరు బాలికను వేధింపులకు గురిచేస్తున్న ఓ యువకుడిని నిర్మల్ జిల్లా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మామడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను డీఎస్పీ గంగారెడ్డి వివరించారు. మామడకు చెందిన 17 ఏళ్ల బాలిక, ఆమె చెల్లెలితో దిగిన ఫొటోలను ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. దీంతో ఆమెతో ఎలాగైనా మాట్లాడాలన్న ఉద్దేశంతో అదే గ్రామానికి చెందిన సాగర్ అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో సదరు బాలిక పేరిట ఫేక్ ఐడీని తయారు చేశాడు. ఆమె ఫోటోను డీపీగా పెట్టి చాట్ చేయడం మొదలు పెట్టాడు. దీంతో తమ ఫొటోలను ఎందుకు డీపీగా పెట్టావని బాలిక ఇన్‌స్టాలోనే ప్రశ్నించింది. అయితే నిందితుడు తన వివరాలను ఏమీ చెప్పకుండా.. ఎక్కువగా మాట్లాడితే ఫోటోలను అశ్లీలంగా మార్ఫింగ్ చేసి పెడతానని బాలికను బెదిరించాడు. వెంటనే ఆమె ఇన్‌స్టాగ్రామ్ నుంచి లాగౌట్ అయింది. దీంతో ఆమె పరువు తీయాలన్న ఉద్దేశంతో బాలిక పేరిట మరోఫేక్ ఐడీని తయారు చేసి దానికి డీపీగా ఆమె ఫొటోతో పాటు అశ్లీల ఫోటోను పెట్టాడు. ఈ విషయంలో నిందితుడు సాగర్‌తో పాటు గ్రామానికి చెందిన మరికొందరిపైనా అనుమానం వచ్చిన బాలిక తన కుటుంబీకులతో కలిసి మామడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు... అనుమానితులు అందరిపైనా నిఘా పెట్టి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో బాలికను వేధించింది సాగరేనని తేలడంతో... అతణ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మామడలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన మాజీ జడ్పీ చైర్ పర్సన్ దంపతులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్ పర్సన్ శోభారాణి, బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి వి. సత్యనారాయణ గౌడ్ దంపతులు శనివారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, తదితరుల సమక్షంలో వారు బీజేపీలో చేరారు. కౌన్సిలర్ బిట్లింగ్ నవీన్, ఏ. రమాదేవి, ఎడపెల్లి నరేందర్, మాజీ కౌన్సిలర్ పోడెల్లి గణేష్, సోన్ ఎంపీటీసీ దాసరి శ్రీనివాస్, కడ్తాల్ సర్పంచ్ బర్మ నర్సయ్య, బోరిగాం సర్పంచ్ రాజారెడ్డి, తదితరులు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

నేలకొరిగిన వరి పంట.. ఆందోళనలో రైతులు

సారంగాపూర్, ఏప్రిల్ 20 : సారంగాపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి అకాల వర్షం కురియడంతో వరి పంట నేలకొరిగింది. దీంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించే వరి పంట చేతికి వచ్చిన సమయంలో ఈదురు గాలులతో కూడిన రాళ్ల వర్షం కురియడంతో వరితో పాటు నువ్వ పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు ఈదురు గాలులు వీయడంతో రోడ్ల ప్రక్కన ఉన్నటువంటి చెట్లు రోడ్లపై విరిగి పడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పంటల పెట్టుబడికి చేసిన అప్పులు ఎలా తీర్చాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడిన చెట్లు

ఈదురు గాలుల బీభత్సం



నేలకొరిగిన మొక్కజొన్న పంట

కుభీర్, ఏప్రిల్ 20 : మండల కేంద్రంతో పాటు మండలంలోని ధార్‌కుభీర్, బెల్గాం, బెల్గాం తండా 1, 2 , డొడర్న తండాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఈదురుగాలుల తీవ్రతకు నువ్వ, మొక్కజొన్న, జొన్న ఎంటలు నేలకొరిగాయి. దీంతో చేతికి వచ్చిన పంట నష్టపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. గాలుల తీవ్రతకు ధార్‌కుభీర్-బెల్గాం రహదారిపై పదుల సంఖ్యలో పెద్ద పెద్ద చెట్లు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ధార్‌కుభీర్, బెల్గాం, బెల్గాం తండా అంతరాయం ఏర్పడి తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రానికి చెందిన కలీమోద్దిన్ అనే రైతు చేన్లో గల పశువుల పాక ఈదురు గాలుల తాకిడికి కుప్పకూలింది. అందులో ఉన్న పశువులకు గాయాలు కాగా గేదె మృతి చెందినట్లు రైతులు తెలిపారు.

అకాల వర్షంతో అన్నదాతల ఆందోళన



విరిగిపడిన ట్రాన్స్‌ఫార్మర్

కుంటాల, ఏప్రిల్, 20: కుంటాల మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి చాలా చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే కోత దశలో ఉన్న జొన్న, నువ్వుతో పాటు వరి పంటలు నేలవాలాయి. తెల్లవారుజామున ఒకేసారి బలమైన గాలివాన రావడంతో పలు చోట్ల ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. అంతేగాకుండా విద్యుత్ స్తంభాలు విరిగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న, వరిధాన్యం కల్లాల్లో తడిసి ముద్దయ్యాయి. ఒకేసారి గాలివాన రావడంతో ధాన్యం కుప్పలపై టార్ఫలిన్‌లు లేచిపోయి ధాన్యం తడిసి ముద్దయ్యింది. గత వారం రోజుల నుండి వర్షాలు కురుస్తుండడంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శనివారం ఉష్ణోగ్రత గరిష్టం 38.2 కనిష్టం 28.9
నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 21 ఏప్రిల్ 2024



బీఆర్‌ఎస్‌కు.. బిగ్ షాక్





హైదరాబాద్‌లో బీజేపీలో చేరిన జిల్లాకు చెందిన పలు పార్టీల నాయకులు

- జిల్లాలో బీఆర్‌ఎస్‌కు మరో గట్టి ఎదురు దెబ్బ
- ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ శోభారాణి సత్యనారాయణ గౌడ్‌లు బీజేపీలోకి..
- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి నగేష్‌ల ఆహ్వానం
- నేడో రేపో భారీ ఎత్తున చేరికల పర్వం

నిర్మల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల తరువాత ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా బీఆర్‌ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతుండడంతో జిల్లాలో ఇక ఆ పార్టీ కోలుకోవడం కష్టమేనంటున్నారు. సీనియర్ నేతలు, మాజీ ప్రజా ప్రతినిధులంతా వరుస కట్టి అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పార్టీలో చేరుతుండడం ఆపార్టీని తేరుకోలేకుండా చేస్తోంది. మొన్నటి వరకు బీఆర్‌ఎస్ పార్టీకి పెద్దదిక్కుగా, రాష్ట్రమంత్రిగా కొనసాగిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సైతం పార్టీ మారేందుకు చేస్తున్న ప్రయత్నం ఇంకా కొనసాగుతోంది. అయితే మాజీ మంత్రి సమాచారం ఇవ్వకుండానే ఆయనతో ప్రమేయం లేకుండానే బీఆర్‌ఎస్ పార్టీ నేతలు తమ ఇష్టానుసారంగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. క్రమక్రమంగా ఆ పార్టీ మొత్తం ఖాళీ కాబోతున్న నేపథ్యంలో సీనియర్ నేతగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ భర్తగా పేరున్న వి.సత్యనారాయణగౌడ్‌తో పాటు ఆయన సతీమణి శోభారాణిలు ఇక బీజేపీలో చేరడం లాంఛనప్రాయమైంది. శనివారం బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్ రెడ్డి ఆ పార్టీ లోక్‌సభ అభ్యర్థి నగేష్, జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, లోక్‌సభ ఇన్‌చార్జీ అయ్యన్న గారి భూమయ్యలతో పాటు తదితర సీనియర్ నేతలంతా సత్యనారాయణగౌడ్ ఇంటికి వెళ్లి ఆయనతో చర్చలు జరిపారు. పార్టీలోకి రావాలంటూ వారు ఆహ్వానించారు. తమ పార్టీలో చేరితే ప్రాధాన్యత కల్పిస్తామని వారు హామీనిచ్చారు. ఈ చర్చల అనంతరం సత్యనారాయణగౌడ్ బీజేపీలో చేరేందుకు అంగీకరించారు. నేడోరేపో ఆయన తన అనుచరులు, మద్దతుదారులతో కలిసి పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. ఈ పరిణామం మూలిగే నక్కపై తాటి కాయపడ్డ చందంగా బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితి మారిందంటున్నారు. ఇప్పటికే వరుస వలసలతో కుదేలైన బీఆర్‌ఎస్‌ను ఇటు కాంగ్రెస్ అటు బీజేపీలో పోటాపోటీగా దెబ్బతిస్తున్నాయి. దీని కారణంగా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రతికూల పవనాలు ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదంటున్నారు.



బీజేపీలో చేరాలంటూ సత్యనారాయణగౌడ్ దంపతులను ఆహ్వానిస్తున్న నాయకులు

సత్యనారాయణ గౌడ్ చేరిక లాంఛనప్రాయయే

ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత సత్యనారాయణ గౌడ్ బీజేపీలో చేరడం లాంఛనప్రాయమైంది. ఆయనతో బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి తదితరులంతా చర్చలు జరిపి పార్టీలో చేరేందుకు అంగీకరింపజేశారు. గత అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి ఆయన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకలాపాలకు దాదాపు దూరంగా ఉంటున్నారు. అలాగే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో సైతం ఆయన అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తూ తన అనుచరులు, మద్దతుదారులు, కార్యకర్తలతో సమాలోచనలు జరుపుతూ వచ్చారు. అయితే చాలా మంది సీనియర్ బీజేపీ నేతలతో సత్యనారాయణగౌడ్‌కు సన్నిహిత సంబంధాలుండడం అలాగే కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చకపోవడంతో ఆయన ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపే మొగ్గుచూపుతూ వచ్చారు. ఈ క్రమంలోనే ఆయనపై కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం పార్టీలో చేరే విషయమై ఒత్తిళ్లు తీసుకు వచ్చారు. ఇలా గత కొంతకాలం నుంచి ఆయన తన రాజకీయ భవిష్యత్‌పై మల్లగుల్లాలు పడుతున్న క్రమంలోనే ఎట్టకేలకు బీజేపీ వైపు మొగ్గు చూపారు. రెండు మూడు రోజుల్లో ఆయన బీజేపీలో చేరడం ఖాయమైందంటున్నారు.



సత్యనారాయణ గౌడ్

పలు మండలాల్లో ప్రభావం...

కాగా సత్యనారాయణగౌడ్ బీజేపీలో చేరుతుండడం ఆ పార్టీకి నాలుగైదు మండలాల్లో మరింత బలం చేకూరనుందంటున్నారు. నిర్మల్ ఎంపీపీగా, కాకతీయ యూనివర్సిటీ పాలకవర్గ సభ్యుడిగా కొనసాగిన సత్యనారాయణ గౌడ్ తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఆ తరువాత కేసీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యంతో ఆయన తెలంగాణ ఉద్యమంలో చేరడమే కాకుండా బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం కూడా తీసుకున్నారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్‌పర్సన్‌గా తన సతీమణి శోభరాణిని ఎంపిక చేసుకోగలిగారు. దీని కారణంగా సత్యనారాయణగౌడ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతగా గుర్తింపు పొందారు. అయితే ప్రస్తుతం ఆయన బీజేపీలో చేరబోతున్నందున నిర్మల్, సోన్, లక్ష్మణచాంద, నిర్మల్ పట్టణంతో పాటు మరికొన్ని మండలాల్లో ఆయన ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంటున్నారు.

బీజేపీకి అదనపు బలం

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రస్తుత ప్రజా ప్రతినిధులంతా వరుసకట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సమయంలో సత్యనారాయణగౌడ్ బీజేపీలో చేరడం ఆ పార్టీకి మరింత కలిసి వస్తుందని అంటున్నారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల సమయంలో సత్యనారాయణగౌడ్ బీజేపీలో రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంటోందని అంటున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 50వేల ఓట్ల మెజార్టీని జిల్లాలో ఆ పార్టీ సాధించింది. సత్యనారాయణ గౌడ్ చేరికతో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఈ మెజార్టీ మరింత పెరిగే అవకాశాలుంటాయని పరిశీలకులు పేర్కొంటున్నారు. మొత్తానికి సత్యనారాయణగౌడ్ దంపతులు బీజేపీలో చేరబోతుండడంతో ఆ పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొంటోందంటున్నారు.

సింగాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయంలో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖానాపూర్, ఏప్రిల్ 20 : మండలంలోని సింగాపూర్ గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో దొంగతనం జరిగింది. ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి గుడి తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలో చొరబడి రెండు హుండీలను పగలగొట్టారు. ఈ హుండీలలో ఉన్న నగదును దొంగలు అపహరించుకుపోయారు. శనివారం తెల్లవారు జామున ఆలయ పూజారి లింగయ్య వచ్చి చూసేసరికి ఆలయం తాళం పగలగొట్టి ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం ఘటన స్థలాన్ని కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి పరిశీలించారు. పూజారి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు వీర హనుమాన్ శోభాయాత్ర

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం వీర హనుమాన్ శోభాయాత్ర ఉదయం పది గంటలకు దేవరకోట నుంచి ప్రారంభిస్తున్నట్లు అధ్యక్షుడు ఎం.కపిల్ తెలిపారు. హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొనున్నారన్నారు.

ఘనంగా మహాదేవుని జెండా పండుగ



భోసిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తానూర్, ఏప్రిల్ 20 : మండలంలోని భోసి గ్రామంలో శనివారం మహాదేవుని జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జెండాతో ఊరేగింపు నిర్వహించారు. ఈ పండుగను చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు.

సమస్యలు పరిష్కరించండి : పీఆర్టీయూ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహనలో తలెత్తు తున్న సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు సాయన్న, రవిరాజు డీఈవోను కోరారు. శనివారం వారు వినతి పత్రం అందజేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు, తదితర సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు.

కాంగ్రెస్ పేద ప్రజల పార్టీ

- జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క



కల్లూర్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కుంటాల, ఏప్రిల్, 20 : కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పార్టీ అని అందుకే పేద గిరిజన మహిళకు ఎంపీ టిక్కెట్ కట్టబెట్టిందని ఈమెను ఎంపీ అభ్యర్థిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క అన్నారు. శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్లూరు సాయిబాబా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్రంలో గత పది సంవత్సరాల నుండి అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీతో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. గ్యాస్ సిలిండర్ ధర నుండి పెట్రోల్, డిజిల్ , బంగారం ధరలను విపరీతంగా పెంచిందన్నారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరు వాడే బట్టలను మొదలు పెడితే పూజకు ఉపయోగించే అగరవత్తులకు సైతం పన్నులు వేస్తుందన్నారు. జన్‌ధన్ ఖాతా ద్వారా ఖాతలో డబ్బులు వేస్తానన్న ప్రధానమంత్రి పది సంవత్సరాలుగా పేదలకు ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే పలు హామీలను నెరవేర్చడం జరిగిందని, రాబోయే రోజుల్లో రైతులకు రెండు లక్షల రుణమాఫీతో పాటు మిగిలిన హామీలన్నింటిని నెరవేరుస్తామన్నారు. పేదింటి ఆడపడుచైన ఆత్రం సుగుణను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రజలకు కోరారు. పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచిన తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఆమెతో పాటు తానుకూడా అహర్నిశలు కృషి చేస్తామన్నారు. మాయమాటలు చెప్పే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మవద్దని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో సుగుణ ఉపాధ్యాయ వృత్తిని వదిలేసి ప్రజల్లోకివచ్చిందని ఆమెను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణ రావు పటేల్, రేఖానాయక్, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, జిల్లా కోఆర్డినేటర్ వెంకటరమణ రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రూ. లక్షా 15 వేలను పట్టుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న డబ్బు

సారంగాపూర్, ఏప్రిల్ 20 : మండలంలో గల చించోలి(బి) ఎక్స్‌రోడ్ వద్ద పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద నిర్మల్ - ఆదిలాబాద్ రహదారిపై శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌పై లక్ష్మణ్ ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. లక్షా 15 వేలను స్వాధీనం చేసుకున్నారు. రూ. లక్షా 15 వేలను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి గ్రీవెన్స్ కమిటీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చంద్ర మోహన్ తెలిపారు. ఈ వాహనాల తనిఖీలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'గమ్యం' యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 20 : నిర్మల్ మండలం రత్నాపూర్ కాండ్లీ గ్రామంలో ఆర్టీసీ నిర్మల్ డిపో ఆధ్వర్యంలో గమ్యం యాప్ గురించి యువకులు, గ్రామస్తులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గల అన్ని ఆర్టీసీ బస్సుల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని కంట్రోలర్ ఎల్. నర్సయ్య, డి. గంగన్న తెలిపారు. విద్యార్థులు, యువకులకు ఇది చాలా అవసరం పడుతుందని, అందరూ దీనిని వినియోగించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో గ్రామ వీడీసీ సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు కూల్ వాటర్ క్యాన్ల పంపిణీ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : ఆర్టీసీ డ్రైవర్లకు నిర్మల్ డిపోలో శనివారం వేసవి దృష్ట్యా కూల్ వాటర్ క్యాన్లను డిప్యూటీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ అందజేశారు. డ్రైవర్లు డ్యూటీకి వెళ్లేటప్పుడు ఈ క్యాన్లలో నీటిని నింపుకొని పోవాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డీఎం ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కడ్తాల్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : సోన్ మండలం కడ్తాల్, ముజ్గి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించాలని మహిళా ఉపాధ్యాయురాలు అల్లూరి కృష్ణవేణి కోరారు.

ఫుడ్ పాయిజన్ ఘటన మళ్లీ పునరావృతం

- భయం గుప్పిట్లో నర్సాపూర్ (జి) కేజీబీవీ స్కూల్ విద్యార్థులు
- ఎంఈవో, డీఈవో, సెక్టోరియల్ అధికారులను సస్పెండ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్‌లో ఫుడ్‌పాయిజన్ ఘటన మరోసారి పునరావృతం అయ్యింది. శుక్ర, శనివారాల్లో కలుషిత ఆహారం తిన్న 22మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో కలుషిత ఆహారం తిని 11మంది వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మి స్టూడెంట్స్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించగా.. ముగ్గురు పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. శనివారం మరో పదకొండు మంది అస్వస్థతకు గురి కావడంతో స్కూల్‌లోనే వైద్య సేవలు అందించారు. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థుల తల్లితండ్రులు స్కూల్ వద్ద అధికారులతో వాగ్వాదానికి దిగారు. శుక్రవారం విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని పాఠశాల సిబ్బంది తమకు సమాచారం ఇవ్వలేదని మండిపడ్డారు. వెంటనే ఎంఈవో, డీఈవోతో పాటు సెక్టోరియల్ అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గత పదిహేడు రోజుల క్రితం కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావ్ మంత్రి సీతక్కకు ఫోన్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని విద్యార్థుల తల్లితండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నర్సాపూర్ ఘటనపై మంత్రి సీతక్క సీరియస్

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు
- ప్రభుత్వాన్ని బద్నాం చేస్తే ఊరుకునేది లేదు
- 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి'తో మంత్రి సీతక్క

నిర్మల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జి) కేజీబీవీ పాఠశాలలో జరిగిన ఘటనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. శనివారం సాయంత్రం ఆమె 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల ఘటనపై ఆమె సంబంధిత శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. భోజన నిర్వాహకులు చేసిన పొరపాటును ప్రభుత్వానికి ఆపాదించి ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతాన్ని ఆమె ఖండించారు. కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. అనవసరంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

కలుషిత ఆహారం ఘటనలో బాధ్యులపై చర్యలు : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 20 : నర్సాపూర్(జి) కేజీబీవీ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశం మేరకు ఇన్‌చార్జి స్పెషల్ అధికారికి షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. ముగ్గురు వంట మనుషులను టెర్మినేట్ చేశామని పేర్కొన్నారు. కోఆర్డినేటర్‌ను మాతృశాఖకు రిలీవ్ చేశామన్నారు. విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు.

సీఎంఆర్ వేగవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అర్లి ఎక్స్ రోడ్డు వద్ద గల రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కుంటాల, ఏప్రిల్, 20 : గత వర్షాకాలంలో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యం నుంచి వచ్చే బియ్యాన్ని (సీఎంఆర్) ప్రభుత్వానికి అందించడం వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆదేశించారు. శనివారం కుంటాల మండలంలోని అర్లిఎక్స్ రోడ్డు వద్ద గల శ్రీద్వారకామాయి అగ్రో రైస్‌మిల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైస్‌మిల్ యజమాని గత వర్షాకాలం సీజన్‌లో ప్రభుత్వానికి 2,320 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని అందించాల్సి ఉందని ఇప్పటి వరకు అందించిన బియ్యంతో పాటు త్వరితగతిన ప్రభుత్వానికి ధాన్యం నుంచి బియ్యాన్ని తీసి ప్రభుత్వానికి అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వలక్ష్యం మేరకు రైస్‌మిల్ యాజమానులు పనిచేయాలన్నారు. ఈయన వెంట డీసీఎస్‌వో నందిని, ఇండస్ట్రీయల్ జనరల్ మేనేజర్ నర్సింహారెడ్డి, ఎంఆర్‌వో ఎజాజ్ అహ్మద్, ఆర్‌ఐ అడెల్లు పలువురు సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్ (జి) కేజీవీబీని తనిఖీ చేసిన కలెక్టర్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని కేజీవీబీ పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీలించి ఫుడ్‌పాయిజన్ వల్ల అస్వస్తతకు గురైన విద్యార్థుల పరిశీలించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, డైనింగ్‌హాల్, వంట కోసం ఉపయోగించే వాటర్‌ట్యాంకును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఫుడ్ పాయిజన్ వలన అస్వస్థకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.మరోసారి ఇలాంటి సంఘటనలు జరిగితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీరోజు మోనూ ప్రకారం శుభ్రమైన బోజనం అందించాలని ఆదేశించారు. బోజనానికి నాణ్యమైన కూరగాయలు, సరుకులనే వాడాలని అన్నారు. ఈ ఘటనకు సంబంధించి నివేదికను అందించాలని ఆదేశించారు. ఆ తర్వాత గ్రామంలోని మిషన్ భగీరథ నీటిట్యాంకు పైకి ఎక్కి ట్యాంకును పరిశీలించారు. నీటి సరఫరాకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిరంతరం నీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేయాలని సూచించారు. అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆ తర్వాత రాంపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా చేపట్టనున్న పనులను రెండు వారాల్లోపు పూర్తి చేయాలని అధికారులను ఆధేశించారు. విద్యుత్, మరుగుదొడ్ల, నీటిసరఫరా, స్లాబ్‌లీకేజీ వంటి పనులు చేపట్టాలని సూచిం చారు. పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ప్రతీ పోలింగ్ కేంద్రంలో విద్యుత్ వికలాంగులకు రాంప్ సౌకర్యం, మరుగుదొడ్లు, తాగునీటి వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలనిఅధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. అనారోగ్యానికి గురికాకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు.



కేజీబీవీ పాఠశాలలోని నీటి ట్యాంకును పరిశీలిస్తున్న దృశ్యం



రాంపూర్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్